సాక్షి సూర్యాపేట

మంగళవారం ၊ 29 ၊ జూలై ၊ 2025



వెలవెలబోయిన..
యాదగిరి క్షేత్రానికి భక్తుల రాక తగ్గింది. ఎప్పుడూ భక్తులతో కనిపించే ఆలయం సోమవారం వెలవెలబోయింది. - 8లో



నవనీత.. సాగులో ఘనత
తుర్కపల్లి మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన పంగాల నవనీత ఐదేళ్లుగా వివిధ పంటల సాగులో రాణిస్తోంది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : **590** అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	**585** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**2,01,229** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**42,913** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	**28,785** క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	**5,394** క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	**6,634** క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	**1,800** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	**300** క్యూసెక్కులు

నందికొండ.. నిండుకుండ

పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో సాగర్ జలాశయం.. నేడు గేట్ల ఎత్తివేత



నీటితో కళకళలాడుతున్న సాగర్ జలాశయం

- ఎగువ నుంచి భారీగా వరద
- నేడు క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్న మంత్రులు
- 18 ఏళ్ల తర్వాత జూలైలో తెరుచుకుంటున్న క్రస్ట్‌గేట్లు

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ జలాశయం నిండు కుండలా మారింది. సాగర్ గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 585.00అడుగుల (297.7235 టీఎంసీలు)కు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో ఉండడం, ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో మంగళవారం క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నారు. ఇందు కోసం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నాగార్జునసాగర్ రానున్నారు. మంత్రుల పర్యటన నిమిత్తం అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. స్థానిక బీసీ గురుకుల మైదానంలో హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. ఉదయం 10 నుంచి 11 గంటల సమయంలో మంత్రులు కృష్ణమ్మకు వాయినమిచ్చి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నారు. 18 సంవత్సరాల తర్వాత ఈసారి జూలై మాసంలోనే క్రస్ట్ గేట్లు తెరుచుకుంటున్నాయి.

శ్రీశైలానికి భారీగా వరద

ఈ ఏడాది కృష్ణా పరివాహక ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు జలాశయాలు ముందుస్తుగానే జలకళను సంతరించుకున్నాయి. ఆల్మట్టి నుంచి శ్రీశైలం జలాశయం వరకు గల జలాశయాలు గరిష్టస్థాయి నీటిమట్టాలకు చేరాయి. అదనంగా వచ్చే వరదను శ్రీశైలం మీదుగా నాగార్జునసాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి సోమవారం రాత్రి 2,10,920 క్యూసెక్కుల వరద వస్తోంది. కాగా, సోమవారం ఉదయం రెండు గేట్ల నుంచి, మధ్యాహ్నం 12గంటలకు మూడు గేట్లు, సాయంత్రం 4 గేట్లు, రాత్రి వరకు మొత్తం ఐదు గేట్లను 10 అడుగులు ఎత్తి స్పిల్‌వే మీదుగా 1,35,325 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 65,904 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. దీంతో నాగార్జునసాగర్ జలాశయానికి 2 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చి చేరుతోంది.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

సాగర్ విద్యుదుత్పాదన కేంద్రంలో ప్రస్తుతం పూర్తిస్థాయిలో విద్యుదుత్పాదన చేస్తున్నారు. ఆ నీరంతా టెయిల్‌పాండ్ ద్వారా పులిచింతల జలాశయానికి చేరుతోంది. ఇక, నిన్నటి వరకు కుడి కాల్వకు కేవలం 511 క్యూసెక్కుల నీటినే విడుదల చేశారు. మంగళవారం నుంయి ఐదు వేల క్యూసెక్కులకు పెంచారు.

నదిలోకి వెళ్లవద్దు : నల్లగొండ కలెక్టర్

సాగర్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నందున మత్స్యకారులు, రైతులు నదీతీర ప్రాంతాలకు నదిలోకి వెళ్లవద్దని నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నదిలో మోటర్లు ఉంటే వెంటనే తొలగించుకోవాలని, మత్స్యకారులు వలలు, పుట్టీలను ఒడ్డుకు చేర్చుకోవాలని సూచించారు.

2007 తర్వాత ఇప్పుడే..

గడిచిన 18 సంవత్సరాల కాలంలో ఏనాడూ ఇంత ముందస్తుగా సాగర్ జలాశయానికి వరద రాలేదు. కేవలం 2007లో ముందస్తుగా వరదలు వచ్చి జలాశయం గరిష్టస్థాయికి చేరడంతో జూలై 14వ తేదీన జలాశయం 587.80 అడుగులకు చేరడంతో క్రస్ట్‌గేట్లెత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. తిరిగి ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరద వచ్చి చేరడంతో జూలై మాసంలోనే గేట్లు ఎత్తాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

సాగర్ ఆయకట్టుకు నేడు నీటి విడుదల

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ ఆయకట్టుకు మంగళవారం రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నీటిని విడుదల చేయనున్నారు. మంత్రులు ఉదయం 10గంటల వరకు సాగర్‌కు చేరుకుని 11 గంటలలోపు కాల్వకు నీటిని విడుదల చేయనున్నారు. గడిచిన 18 సంవత్సరాల్లో జూలై మాసంలో కాల్వలకు నీటిని విడుదల చేసిన సందర్భాలు లేవు. 2006లో జూలై 21, 2007లో జూలై 14న నీటిని విడుదల చేశామని ఎన్నెస్పీ అధికారులు తెలిపారు.

10.38లక్షల ఎకరాల ఆయకట్టు

నాగార్జునసాగర్ ఎడమకాల్వ కింద 10.39లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,98,790 ఎకరాలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2,63,736 ఎకరాలు, కృష్ణాజిల్లా 3,68,536 ఎకరాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 6,734 ఎకరాలకు సాగర్ నీరు అందనుంది.



ప్రజావాణికి వచ్చిన దివ్యాంగురాలి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాలి

- సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాలు, వార్డుల్లో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేయాలన్నారు. , సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి అర్జీకి సంబంధించి కచ్చితమైన సమాధానంతో కూడిన కాపీని అర్జీదారునికి పంపాలన్నారు. అలా చేయకపోతే ప్రజలు ఒకే సమస్యపై మరలా దరఖాస్తు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ వీవీ.అప్పారావు, డీఎఫ్‌ఓ సతీష్‌కుమార్, డీఈఓ అశోక్, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, డీసీఓ పద్మ, డీఎస్‌ఓ మోహన్‌బాబు, సంక్షేమ అధికారులు దయానందరాణి, శ్రీనివాస్ నాయక్, శంకర్, జగదీశ్వరరెడ్డి, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, సూపరింటెండెంట్లు సాయిగౌడ్, సంతోష్ కిరణ్, అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత అభినందనీయం

చివ్వెంల : తాము చదువుకున్న పాఠశాలకు చేయూతనందించడం అభినందనీయమని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. చివ్వెంల మండలం కొండల రాయినిగూడెం గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో చదువుకుని వివిధ హోదాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సోమవారం అదే పాఠశాలలో పలువురు విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా టీషర్ట్‌లు, షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో స్థిరపడి మాతృభూమికి సేవచేయడం గర్వకారణమన్నారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు రెండవ తరగతి విద్యార్థి వినయ్ ఇంగ్లిష్‌లో సమాధానం చెప్పగా, ఐదవ తరగతి విద్యార్థిని శ్రీనిధి తెలుగు స్పష్టంగా చదివింది. దీంతో వారిని కలెక్టర్ అభినందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలు, బాలింతలు, గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంఈఓ కళారాణి, హెచ్‌ఎం నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంల : విద్యార్థినికి టీషర్ట్ అందజేస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

న్యూస్‌రీల్

నేడు హుజూర్‌నగర్‌కు మంత్రి ఉత్తమ్ రాక

హుజూర్‌నగర్ : రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం హుజూర్‌నగర్‌కు రానున్నారు. మధ్యాహ్నం 12.45 గంటలకు హెలికాప్టర్‌లో హుజూర్‌నగర్‌కు చేరుకుంటారు. 1:30 గంటలకు స్థానిక కౌండిన్య ఫంక్షన్ హోల్‌లో నూతన రేషన్ కార్డుల పంపిణీలో పాల్గొంటారు. అనంతరం 1.45 గంటలకు హెలికాప్టర్‌లో నకిరేకల్‌కు వెళతారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు



ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, ధూమపానం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కె.నరసింహ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నిఘా ఉంచామని, అక్రమ సిట్టింగ్‌లు, బహిరంగంగా మద్యం, సిగరెట్ తాగడం లాంటి అసాంఘిక చర్యలకు పాల్పడొద్దని పేర్కొన్నారు. మైనర్లకు మద్యం, పొగాకు ఉత్పత్తుల లాంటి మత్తు పదార్థాలను అమ్మవద్దని సూచించారు. వీటి వల్ల పిల్లలు చెడు వ్యసనాలకు అలవాటు పడి నేరాలకు పాల్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



సునిల్ గౌడ్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

చివ్వెంల : న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషిచేస్తానని తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ పి.సునిల్ గౌడ్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. న్యాయవాదులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను బార్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంతకుముందు సునిల్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, న్యాయవాదులు నాతి సవీందర్ కుమార్, మోదుగు వెంకట్‌రెడ్డి, బానాల విజయ్ కుమార్, సోమేష్ కుమార్, బత్తిని వెకటేశ్వర్లు, పాదిల ప్రదీప్ కుమార్, పంతంగి కృష్ణ, వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, కంచర్ల సతీష్ కుమార్, కట్ట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి



నూతన ప్రిన్సిపాళ్లను సన్మానిస్తున్న భానునాయక్ తదితరులు

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డీఐఈఓ) భానునాయక్ అన్నారు. సోమవారం సూర్యాపేటలోని జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంలో కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల్లో అయిన అడ్మిషన్లు, డైస్, అపార్, ఆదర్శ కమిటీల ఏర్పాటుతోపాటు తదితర అకడమిక్‌కు సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ప్రిన్సిపాళ్లుగా పదోన్నతిపై జిల్లాకు వచ్చిన బచ్చలకూరి మృత్యుంజయ (తిరుమలగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల) హరిప్రసాద్ (నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల)ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

30న జాబ్‌మేళా

నల్లగొండ : నిరుద్యోగ యువతకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 30న ఉదయం 10:30 గంటలకు నల్లగొండలోని ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మ తెలిపారు. ఎస్ఎస్‌సీ నుంచి ఏదేని డిగ్రీ, డిప్లొమాలో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 30 ఏళ్ల వయసు గల అభ్యర్థులు వారి ఒరిజినల్స్, బయోడేటాతో హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 78934 20435 ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

రైతులకు రాయితీ పరికరాలు

- యాంత్రీకరణ పథకం కింద 125 యూనిట్లు కేటాయింపు
- జిల్లాకు రూ.1.84 కోట్లు మంజూరు
- ఆగస్టులో దరఖాస్తుల స్వీకరణ
- సెప్టెంబర్ రెండో వారం వరకు పంపిణీ



నాగారం : జాతీయ యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందించేందుకు ప్రభుత్వం జిల్లాకు 125 యూనిట్లు మంజూరు చేసింది. ఇందుకు గాను రూ.1.84 కోట్ల నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేసింది. సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్ఎంఏఎం) పథకం కింద ప్రభుత్వం ఈ నిధులిచ్చింది. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 40 శాతం భరిస్తూ ఈ పథకాన్ని అమలు చేయనున్నాయి. ఇందుకోసం అర్హులైన రైతులను త్వరలో ఎంపిక చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అయితే ఆగస్టు నుంచి దరఖాస్తులు స్వీకరించి సెప్టెంబర్ 17 వరకు పంపిణీ చేయాలని నిర్ణయించారు.

మహిళలకు 50 శాతం..

రైతులకు అందించే వ్యవసాయ పరికరాలపై ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళా రైతులకు 50శాతం రాయితీ ఇవ్వనున్నారు. మిగతా వారికి 40 శాతం రాయితీపై అందిస్తారు. ఎంపికైన రైతుల నుంచి సబ్సిడీ పోను పెట్టుబడి వాటాను డీడీల రూపంలో తీసుకోనున్నారు.

కమిటీల ద్వారా ఎంపిక

రైతులకు రాయితీ పరికరాలు ఇచ్చేందుకు జిల్లా, మండల స్థాయి కమిటీల ద్వారా ఎంపిక చేయనున్నారు. జిల్లా కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఏఓ, అగ్రోస్ ఆర్‌ఎం, ఎల్‌ఎడీఎం, డాట్ సెంటర్ శాస్త్రవేత్త సభ్యులుగా ఉంటారు. మండల స్థాయి కమిటీలో మండల వ్యవసాయాధికారి, తహసీల్దార్, ఎంపీడీఓలు ఉంటారు. అర్హులైన రైతులను ఈ కమిటీలు ఎంపిక చేస్తాయి.

అర్హతలు ఇవే..

రాయితీ పరికరాలను పొందేందుకు సదరు రైతులకు కనీసం ఎకరం భూమి ఉండాలి. రాయితీ రూ.లక్ష దాటితే జిల్లా కమిటీ ఆమోదం తప్పనిసరి. వచ్చిన యూనిట్లను మండలాల వారీగా కేటాయిస్తారు. ఈ నిధులు ఖర్చు చేసిన తర్వాత రెండో విడతలో యూనిట్లు వచ్చే అవకాశం ఉంటుంది.

సబ్సిడీ పరికరాలు ఇవే..

మ్యానువల్ స్ప్రేయర్లు, పవర్ ఆపరేటర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్‌తో నడిచే వ్యవసాయ పరికరాలు, రోటోవేటర్లు, నాగళ్లు, గొర్రులు, కలుపు తీసే యంత్రాలు, కేజీవీల్స్ వంటివి 125 యూనిట్లు మంజూరయ్యాయి.

దరఖాస్తులు స్వీకరిస్తాం..




ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన రైతులకు రాయితీపై పరికరాలను అందజేస్తాం. త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభిస్తాం.
– జి.శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

నేడు విద్యాకమిషన్ బృందం రాక

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణ సమీపంలోని అన్నెపర్తిలో ఉన్న మహాత్మా గాంధీ యూనివర్సిటీకి మంగళవారం విద్యా కమిషన్ బృందం రానుంది. కమిషన్ చైర్మన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళితో పాటు కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వర్ రావు, డాక్టర్ చారకొండ వెంకటేశ్, కె.జ్యోష్ణ శివారెడ్డి ఎంజీ యూనివర్సిటీని సందర్శించనున్నారు. కమిషన్ బృందం సభ్యులు ఉదయం 10.30 గంటలకు సెమినార్ హాల్‌కు చేరుకొని విద్యా అంశాలపై చర్చించనున్నారు. యూనివర్సిటీ అధ్యాపకులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, విద్యార్థి సంఘాల నాయకులు, అఫ్లియేటెడ్ కళాశాలల యాజమాన్యాలు, టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలతో విద్యా కమిషన్ బృందం సమావేశం కానుందని ఎంజీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అలువాల రవి తెలిపారు.

మూసీకి 1,604 క్యూసెక్కుల వరద

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతుంది. సోమవారం 1,604 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అధికారులు ప్రాజెక్టు రెండు క్రస్ట్ గేట్లను ఒక అడుగు మేర పైకెత్తి 1,281 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు కాగా 643.20 మేర అడుగుల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టుకు 549 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సీపేజీ, లీకేజీ, ఆవిరి రూపంలో 72 క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది. గేట్ల ద్వారా, కాల్వలకు కలిపి మొత్తం 1904 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుండి విడుదలవుతుంది. మూసీ రిర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 3.99 టీఎంసీల నీరు ఉందని ప్రాజెక్టు ఏఈ మధు తెలిపారు.



గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకలాయణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో పూజలు, అభిషేకాలు, హోమం చేశారు. అనంతరం ఎదుర్కోలు మహోత్సవం, కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. క్షేత్రంలోగల శివాలయంలోని శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

కల్తీ మద్యాన్ని అరికట్టాలని ధర్నా

కోదాడరూరల్ : కల్తీ మద్యాన్ని అరికట్టాలని, తయారు చేసి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సోమవారం కోదాడ పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మేళ్లచెరువు మండలం రామాపురంలో తయారు చేసిన కల్తీ మద్యం కోదాడలోని పలు వైన్స్‌లో పట్టుబడిన ఎక్సైజ్ పోలీసులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కల్తీ మద్యం విక్రయిస్తున్న మద్యం దుకాణాల లైసెన్స్ రద్దు చేయాలని అన్నారు. పట్టణంలో బెల్టుషాపులు పట్టుగొడుగుల్లా వెలుస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గంజాయి అక్రమ రవాణాను, విక్రయాలను కట్టడి చేయాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె.నంళ్లా పార్టీ నాయకులు పిట్టల భాగమ్మ, మేదర లలిత, కర్ల సుందర్‌బాబు, దొంగరి శ్రీనివాస్, సంపెట ఉపేందర్‌గౌడ్, జానీ, వెంకట్, మల్లయ్యగౌడ్, అబుబాకర్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



కోదాడ ఎక్సైజ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

‘కల్యాణలక్ష్మి’ నిధులు కాజేశారు

- వివాహ సంవత్సరాన్ని మార్చి బోగస్ పత్రాలు సృష్టించి..
- గత ప్రభుత్వ హయాంలోనే దరఖాస్తులు
- చెక్కులు మంజూరు చేసిన ప్రస్తుత ప్రభుత్వం
- రూ.18లక్షలకుపైగా నొక్కేసినట్టు సమాచారం
- అనంతగిరి మండలంలో సుమారు 18 మంది వరకు బోగస్ లబ్ధిదారులు!



కోదాడ: పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక చేయూతగా గత ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టింది. గత ప్రభుత్వం హయాంలో కొందరు దళారులు బోగస్ పత్రాలు సృష్టించి కొందరి చేత కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేయించగా లబ్దిదారులుగా ఎంపికయ్యారు. వీరికి ప్రస్తుత ప్రభుత్వం ఇటీవల చెక్కులు అందజేసింది. ఈ వ్యవహారంలో అనంతగిరి మండలం గొండ్రియాల, కొత్తగూడెంతోపాటు పక్కనే ఉన్న ఇంకొన్ని గ్రామాలకు చెందిన సుమారు 18 మంది బోగస్ లబ్ధిదారులున్నట్లు తెలిసింది. 15 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్న వారికి కూడా తాజా లబ్ధిదారుల జాబితాలో ఉండడం గమనార్హం. అనంతగిరి మండలానికి చెందిన ఓ రెవెన్యూ అధికారి, కోదాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా ఉన్న మరొకరు, ఆయా గ్రామాలకు చెందిన నాటి బీఆర్‌ఎస్ నాయకులు కలిసి దాదాపు రూ.18 లక్షలకుపైగా కల్యాణలక్ష్మి పథకం నిధులు కాజేసినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారం బయట పడడంతో తమపై కేసులు కాకుండా దళారులుగా వ్యహరించిన వారు రాజకీయ పైరవీలు చేస్తున్నట్టు సమాచారం.

అనంతగిరి మండలం గోండ్రియాల గ్రామానికి చెందిన ఓ యువతికి 2009లో వివాహం జరిగింది. ఈమె వివాహం 2023లో జరిగినట్లు గత ప్రభుత్వ హయాంలో కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేయగా లబ్ధిదారురాలిగా ఎంపికచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో గతేదాది కోదాడలో జరిగిన కార్యక్రమంలో ఈమెకు చెక్కు అందజేశారు. కానీ, రెండు నెలల క్రితం ఈమె తన ఇద్దరి కుమార్తెలకు చీరల ఫంక్షన్ చేయడం గమనించదగ్గ విషయం. మొత్తంగా బోగస్ పత్రాలు సృష్టించి కల్యాణలక్ష్మి పథకం నిధులు కాజేసినట్టు బయట పడింది. ఇలా ఈ గ్రామంతోపాటు కొత్తగూడెం గ్రామంలోనూ సుమారు 18 మంది వరకు బోగస్ పత్రాలు సృష్టించి కల్యాణలక్ష్మి నిధులు కాజేసిన వ్యవహారం ఆయా గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఏం చేశారంటే..

అనంతగిరి మండలంలో పనిచేసిన ఓ రెవెన్యూ అధికారి సాయంతో గోండ్రియాల, కొత్తగూడెం గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తప్పుడు వివాహ పత్రాలు సృష్టించి 2023లో కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరి వివాహాలు ఆయా గ్రామాల్లో జరిగినప్పటికి సమీపంలో ఏపీకి చెందిన పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవాలయంలో, తిరుమలగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగినట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. ఈ సమయంలో పనిచేసిన గ్రామ కార్యదర్శులు ఈ దరఖాస్తులను ధ్రువీకరించడానికి నిరాకరించడంతో కోదాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేసిన ఒకరు తప్పుడు పత్రాలతో వివాహ రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిసింది. ఈ రెండు గ్రామాలకు సమీపంలో ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ఉండడంతో అక్రమార్కులు ఏపీలో కొన్ని గ్రామాలకు చెందిన వారితో కూడా కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేయించి దొడ్డిదారిన లక్షల రూపాయలు కాజేశారని పలువురు ఆరోపిస్తున్నారు.

తిలాపాపం తలా పిడికెడు

కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులో సగం మాత్రమే లబ్ధిదారుడి ఇచ్చి మిగిలిన డబ్బుల్లో రెవెన్యూ అధికారికి రూ.30 వేలు, ముఖ్య నాయకుడికి రూ.20 వేలు, మిగిలిన డబ్బులను ఖర్చుల కింద తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కడంతో మండలానికి చెందిన కొందరు నాయకులు చర్యలు తీసుకోకుండా అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది.

రెండు రోజుల్లో విచారణ పూర్తిచేస్తాం

గోండ్రియాలలో కల్యాణలక్ష్మి చెక్కు విషయంలో అవినీతి జరిగిందని ఫిర్యాదు రావడంతో పూర్తి స్థాయిలో విచారణ చెయిస్తున్నాం. అందరి వాగ్మూలం రికార్డు చేస్తున్నాం. రెండు రోజుల్లో విచారణ పూర్తిచేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. కొత్తగూడెం గ్రామ విషయం మా దృష్టికి రాలేదు. నిర్దిష్టమైన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.
– సీహెచ్.సూర్యనారాయణ, ఆర్డీఓ, కోదాడ

వెలవెలబోయిన యాదగిరీశుడి సన్నిధి

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి భక్తుల రాక గణనీయంగా తగ్గింది. ఎప్పుడు భక్తులతో కిటకిటలాడే ఆలయం.. శ్రావణ మాసం మొదటి సోమవారం భక్తులు లేక వెలవెలబోయింది. ఆలయ మండపాలు, క్యూలైన్లు, మాడ వీధులు, ప్రసాద విక్రయశాల వద్ద భక్తులు లేక నిర్మానుష్యంగా కనిపించింది.

– యాదగిరిగుట్ట


ఉదయం 8గంటల సమయంలో భక్తులు లేక వెలవెలబోతున్న ఆలయ మాడ వీధులు


భక్తులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న వీఐపీ క్యూలైన్

రెండు ఇళ్లలో చోరీ

హుజూర్‌నగర్: తాళం వేసిన రెండు ఇళ్లలో బంగారు ఆభరణాలు, నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా గ్రామపంచాయతీ పరిధిలోని కల్మేట్‌తండాలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన బాణావత్ వెంకటి, భూక్యా సైదాలు వ్యవసాయ పనుల నిమిత్తం ఇంటికి తాళాలు వేసి పొలం పనులకు వెళ్లారు. తిరిగి వచ్చే సమయానికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువా తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా.. బంగారం, నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాణావత్ వెంకటి ఇంట్లో 9 తులాల బంగారు ఆభరణాలు, రూ.90 వేల నగదు, భూక్యా సైదా ఇంట్లో రూ.15వేల నగదు చోరీకి గురైంది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోటేష్ తెలిపారు.

బంగారు ఆభరణాలు, నగదు చోరీ

పెన్‌పహాడ్: మండల పరిధిలోని మేగ్యాతండా ఆవాసం కేవ్లాతండాకు చెందిన చెందిన లకావత్ లక్పతి సోమవారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లో డబ్బాలో ఉన్న తులంన్నర బంగారు చైను, ఉంగరంతోపాటు కొంత నగదు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఎస్సై గోపికృష్ణ తెలిపారు.

నగదు అపహరించిన ముగ్గురి అరెస్ట్

- పరారీలో మరొకరు
- రూ.4లక్షల నగదు, కారు, బంగారం, సెల్‌ఫోన్లు స్వాధీనం

చౌటుప్పల్ : సెకండ్‌హ్యాండ్‌లో కారు కొనేందుకని ఓ వ్యక్తి ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన నలుగురితో కలిసి చౌటుప్పల్‌కు వెళ్లగా అతను వెంట తెచ్చుకున్న నగదును వారు అపహరించుకుపోయారు. ఈ ఘటన ఈనెల 26న చౌటుప్పల్ పట్టణంలో చోటుచేసుకోగా.. ముగ్గురు నిందితులు సోమవారం పోలీసులకు చిక్కారు. ఒకరు పరారీలో ఉన్నారు. కేసు వివరాలను సీఐ మన్మథకుమార్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని నాగోల్‌కు చెందిన వీరగంధం శ్రీనివాస్ అనే వ్యక్తి సెకండ్ హ్యాండ్‌లో కార్లు కొనడం, అమ్మడం చేస్తుంటాడు. గత 20రోజుల క్రితం సెకండ్‌హ్యాండ్‌లో కార్లు కొనబడును, అమ్మబడును అని తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో పోస్ట్ చేశాడు. ఆ పోస్టును చూసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన వేముల పుల్లారావు అలియాస్ శివ(38), కర్నూలు జిల్లా కల్లూరు మండలం శరీన్‌నగర్‌కు చెందిన కర్వాల సునీల్‌కుమార్(45), పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన మిద్దె జగదీష్‌బాబు(46)తోపాటు బత్తుల సాంబశివరావు అనే వ్యక్తులు శ్రీనివాస్‌ను సంప్రదించారు. తమ వద్ద సెకండ్‌హ్యాండ్ కార్లు ఉన్నాయని, కావాలంటే చూపిస్తామని శ్రీనివాస్‌ను నమ్మబలికారు. అతను చేసేది అదే వ్యాపారం అయినందున కారు కొనుగోలుకు చేసేందుకు సిద్ధమేనని శ్రీనివాస్ వారితో చెప్పాడు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

అందరూ కలిసి అద్దె కారులో చౌటుప్పల్‌కు..

సెకండ్‌హ్యాండ్‌లో కారును శ్రీనివాస్‌కు ఇప్పించేందుకుగాను పుల్లారావు, సునీల్‌కుమార్, జగదీష్‌బాబు, సాంబశివరావులు కలిసి ఈనెల 26న అద్దెకారులో నాగోల్‌కు చేరుకున్నారు. శ్రీనివాస్‌ను తమ వెంటబెట్టుకొని చౌటుప్పల్ పట్టణంలోని చిన్నకొండూర్‌రోడ్డులో ఉన్న మసీదు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ అమ్మకానికి ఉన్న ఓ సెకండ్‌హ్యాండ్ కారును చూపించారు. సంబంధిత కారు యజమాని కొద్దిసేపటి తర్వాత వస్తానని చెప్పడంతో వీరంతా అద్దెకు తీసుకువచ్చిన కారులోనే కూర్చున్నారు. ఇంతలోనే శ్రీనివాస్‌కు ఫోన్ రావడంతో మాట్లాడుకుంటూ కారు దిగి బయటకు వెళ్లాడు. శ్రీనివాస్ తెచ్చిన రూ.4లక్షలు కారు డ్యాష్‌బోర్డులో ఉండగా.. ఇదే అదునుగా భావించిన మిగతా నలుగురు నిందితులు నగదును తీసుకొని అక్కడి నుంచి పరారయ్యారు. కొంత సేపటి తర్వాత శ్రీనివాస్ రాగా.. వీరు కనిపించకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న సీఐ మన్మథకుమార్ విచారణ చేపట్టారు. ఆ క్రమంలో ధర్మోజిగూడెం గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు నిందితులు పోలీసులకు చిక్కారు. వారి వద్ద రూ.4లక్షల నగదు, అద్దె కారు, 5గ్రాముల బంగారం, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బత్తుల సాంబశివరావు అనే మరో నిందితుడు పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. నిందితులంతా గతంలో దొంగనోట్లు, దొంగ బంగారం కేసుల్లో వివిధ ప్రాంతాల్లో అరెస్ట్ అయ్యారని చెప్పారు.

అనుమానితులపై కేసు నమోదు

తిరుమలగిరి: మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో ఇటీవల ఎమ్మెల్యే మందుల సామేల్ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పంచాయతీ కార్యదర్శి గిలకత్తుల సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుంగతుర్తి సీఐ నర్సింహారావు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌లు సంఘటన స్థలాన్ని సోమవారం సందర్శించారు. అనుమానితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. త్వరలోనే శిలాఫలకం ధ్వంసానికి పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

తల్లి ఫిర్యాదు.. కుమారులపై కేసు

మునగాల: మండల కేంద్రానికి చెందిన సుంకర భద్రమ్మ అనే వృద్ధురాలు తన ఇద్దరు కుమారులు పోషణ చూడకపోవడంతో మునగాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. భద్రమ్మకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. భద్రమ్మ భర్త సైదులు 2013లో అనారోగ్యానికి గురై మృతిచెందాడు. దీంతో భద్రమ్మ అవివాహితుడైన మూడవ కుమారుడు నాగయ్య వద్ద ఉంటుంది. ఇతను దివ్యాంగుడు. దీంతో భద్రమ్మ పోషణ నాగయ్యకు భారం కావడంతో మిగతా ఇద్దరు కుమారులు వెంకన్న, అంజయ్యలు జీవనభృతి ఇవ్వాలని కోదాడ ఆర్డీఓను ఆశ్రయించింది. స్పందించిన ఆయన భద్రమ్మ జీవనం కోసం ముగ్గురు కుమారులు నెల, నెలా రూ.2వేల చొప్పున బ్యాంకు ఖాతాలో జమచేయాలని ఆదేశించారు. మూడవ కుమారుడు తల్లి ఖాతాలో నగదు జమ చేస్తున్నప్పటికీ మిగతా ఇద్దరు కుమారులు వెంకన్న, అంజయ్య నిర్లక్ష్యం చేయడంతో భద్రమ్మ తిరిగి మునగాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కోదాడ ఆర్డీఓ ఆదేశాల మేరకు వెంకన్న, అంజయ్యలపై ఎస్ఐ కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యం

మోత్కూరు: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మోత్కూరు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. మోత్కూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన కుంచపు వెంకటేష్(42) నెలన్నరగా పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. ఈనెల 27న ఉదయం 9గంటలకు అతడి భార్య కుంచపు విజయ పనికి వెళ్లేటప్పుడు, భర్త వెంకటేష్‌ను తనతో రావాలని కోరినా వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నాడు. భార్య సాయంత్రం 6.30గంటలకు ఇంటికి తిరిగి వచ్చేసరికి వెంకటేష్ కనిపించలేదు. ఈవిషయమై కుమారుడిని ఆమె అడుగగా సాయంత్రం 4గంటలకే బయటకు వెళ్లినట్లు చెప్పాడు. ఆమె చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నవనీత.. సాగులో ఘనత

రెండు ఎకరాల విస్తీర్ణంలో అద్భుతాలు

- పాలీహౌస్‌లలో సేంద్రియ పద్ధతుల్లో కీర సాగు
- కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు, మరో పది మందికి ఉపాధి
- ఆదర్శంగా నిలుస్తున్న పంగాల నవనీత

తుర్కపల్లి : ఆమె సాధారణ గృహిణి. వ్యవసాయంపై ఉన్న మక్కువతో సేద్యంలోకి అడుగుపెట్టింది. పాలిహౌస్‌లు ఏర్పాటు చేసి ఎరుపు, పసుపు రంగు క్యాప్సికం, చెర్రీ టమాట పండించి.. ఇప్పుడు కీరదోస సాగు చేస్తోంది. సేంద్రియ పద్ధతుల్లో మంచి దిగుబడి సాధిస్తూ ఔరా అనిపిస్తున్నారు. కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటునందించడమే కాకుండా మరో పది మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. పంగాల నవనీత.


మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న కీరదోసకాయలు

ఎకరాకు రూ.3లక్షల నుంచి రూ.4లక్షలు

ఏడాదికి రెండు విడతల్లో కీరదోస పండిస్తున్నారు. పంట వేసిన అనంతరం 25 రోజుల తరువాత కాత మొదలవుతుంది. ప్రతి రెండు, మూడు రోజులకోమారు దిగుబడి వస్తుంది. ఒక్క కాతకు 500 నుంచి 600 కిలోల దిగుబడి వస్తుంది. పెట్టుబడి ఎకరాకు రూ.1.5 లక్షలు అవుతుంది. పెట్టుబడి, కూలీల ఖర్చులు పోనూ ఎకరానికి రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు లాభాలు పొందుతున్నారు.

పాడిపంట

లాభాలు తగ్గడంతో కీరదోస వైపు దృష్టి

ఎరుపు, పసుపు రంగు క్యాప్సికం, చెర్రీ టమాట, క్యాబేజీ, కాలిఫ్లవర్ అమ్మకాలకు మార్కెటింగ్ పరంగా ఇబ్బందులు ఎదురవుతుండటం.. పెట్టుబడి, రవాణా ఖర్చులు పెరిగిపోవడంతో లాభాలు తగ్గాయి. దీంతో వాటిని తొలగించి ఆ స్థానంలో ఏడాది క్రితం కీరదోస సాగు ప్రారంభించారు. రెండు ఎకరాల్లోని పాలిహౌస్‌ల్లో కీరదోస సాగు చేస్తున్నారు.



స్థానిక మార్కెట్‌లతో పాటు హైదరాబాద్‌కు ఎగుమతి

పండిన కీరదోసను భువనగిరితో పాటు హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి తదితర ప్రధాన మార్కెట్‌లకు తరలిస్తుంటారు. కిలోకు రూ.25నుంచి 30 వరకు ధర పలుకుతుందని.. పెట్టుబడి, రవాణా ఖర్చులు, మార్కెట్‌ను ముందుగానే అంచనా వేసుకుని సాగు చేయడం వల్ల మంచి లాభాలు పొందగలుగుతున్నామని మహిళా రైతు నవనీత చెబుతున్నారు.

సేంద్రియ పద్ధతుల్లో సాగు

కీరదోస సాగులో ఆవుపేడతో పాటు ఇతర సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. చాలా మంది వ్యాపారులు తోట వద్దకు వచ్చి ఆర్డర్ ఇచ్చి వెళ్తుంటారని నవనీత చెబుతున్నారు. అంతేకాకుండా నీటి వినియోగం చాలా తక్కువగా ఉంటుందని అంటున్నారు.

ఎక్కువ లాభాలు గడించవచ్చు

కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టడమే కాకుండా మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నందుకు గర్వకారణంగా ఉంది. సేద్యంపై నేను చూపుతున్న శ్రద్ధ ఇతర మహిళలు, రైతులకు స్ఫూర్తిదాయకంగా మారుతుంది. ఏ సాగులోనైనా ఆధునిక, సేంద్రియ పద్ధతులు అవలంబించడం వల్ల తక్కువ భూమిలోనూ ఎక్కువ లాభాలు గడించవచ్చు. సాగులో నా భర్త సహకారం ఎంతో ఉంది.

– నవనీత, మహిళా రైతు



మొదట్లో క్యాప్సికమ్, చెర్రీ టమాట, కాలిఫ్లవర్ సాగు

తుర్కపల్లి మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన పంగాల నవనీత ఐదేళ్లుగా సాగులో రాణిస్తోంది. ఆమె భర్త బాలస్వామి వృత్తిరీత్యా ప్రైవేట్ అధ్యాపకుడు. వీరికి ఇద్దరు సంతానం. నవనీతకు వ్యవసాయం అంటే మొదటి నుంచి మక్కువ. వారికున్న నాలుగు ఎకరాల్లో సంప్రదాయ పంటలు సాగు చేస్తుండేవారు. ఆ పంటల ద్వారా ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా సొంత ఖర్చులతో రెండు ఎకరాల్లో ఐదేళ్ల క్రితం రెండు పాలిహౌస్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో ఎరుపు, పసుపు రంగు క్యాప్సికం, చెర్రీ టమాట, క్యాబేజీ, కాలిఫ్లవర్, దోసకాయ పండించేవారు. ఇందులో ఎరుపు, పసుపు క్యాప్సికంను హైదరాబాద్, బెంగళూర్, ముంబయికి ఎగుమతి చేసేవారు. చెర్రీ టమాట, క్యాబేజీ, కాలిఫ్లవర్‌ను స్థానిక మార్కెట్‌లతో పాటు హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి మార్కెట్‌కు తరలించేవారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


నాగయ్య (ఫైల్)

త్రిపురారం : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన త్రిపురారం మండలంలోని కామారెడ్డిగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డిగూడేనికి చెందిన గుండెబోయిన నాగయ్య(50) మాడుగులపల్లి మండలంలోని కన్నెకల్ గ్రామంలోని ఓ వైన్ షాపులో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం నాగయ్య భార్య చెరువుగట్టుకు వెళ్లగా నాగయ్య ఒక్కడే ఇంటి వద్ద ఉన్నాడు. సోమవారం ఉదయం నాగయ్య వైన్ షాపునకు వెళ్లకపోవడంతో షాపు నుంచి అతడికి ఫోన్ చేశారు. స్పందించకపోవడంతో ఇంటి సమీపంలోని వారికి ఫోన్ చేసి నాగయ్య దగ్గరికి వెళ్లమని చెప్పారు. వారు వెళ్లి చూడగా అతను అపస్మారకస్థితిలో కనిపించాడు. గ్రామస్తులు స్థానిక ఆర్ఎంపీ డాక్టర్‌కు సమాచారం అందించారు. నాగయ్య అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారు. మృతుడి భార్య గుండెబోయిన నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ పేర్కొన్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు

పెన్‌పహాడ్: గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేయగా.. మరో ఇద్దరు పరారయ్యారు. ఈ సంఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనంతారం క్రాస్ రోడ్డు వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణానికి చెందిన కొంచెం సాయిగణేష్, శాంతినగర్‌కు చెందిన పవన్, అమరగాని లోకేష్‌లు గంజాయికి అలవాటుపడ్డారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరు వద్ద గంజాయి కొనుగోలు చేసి వారు తాగడంతో పాటు కావాల్సిన వారికి సరఫరా చేస్తున్నారు. అనంతారం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వీరు పోలీసులను చూసి పారిపోతుండగా అనుమానం వచ్చి పోలీసులు వారి స్కూటీని ఆపి తనిఖీ చేశారు. కొంచెం సాయిగణేష్ వద్ద 100గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పవన్, లోకేష్‌లు పరారయ్యారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనాథ వృద్ధుడిని ఆశ్రమంలో చేర్పించిన యువకుడు


అనాథ వృద్ధుడిని ఆశ్రమంలో చేర్పిస్తున్న ప్రవీణ్

మునగాల: అనాథ వృద్ధుడిని అనాథాశ్రమంలో చేర్పించి మానవత్వం చాటుకున్నాడు ఓ యువకుడు. మునగాల మండల కేంద్రంలో మసీద్ ఎదురుగా ఉన్న దుకాణాల ముందు వారం రోజులుగా అనాథ వృద్ధుడు సంచరిస్తున్నాడు. మసీద్ కాంప్లెక్స్‌లోని బైక్ షోరూంలో విధులు నిర్వర్తిస్తున్న పొన్నాల ప్రవీణ్ అనే యువకుడు అనాథ వృద్ధుడి పరిస్థితికి చలించిపోయి మూడు రోజులుగా ఆహారం అందిస్తున్నాడు. వృద్ధుడు మూగవాడు కావడంతో అతడి ఆచూకీ కోసం ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. సోమవారం మండల పరిధిలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో చేర్పించాడు. ఈ విషయం సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ప్రవీణ్‌ను పలువురు అభినందించారు.

మైనర్‌ను వేధించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

నల్లగొండ: మైనర్‌ను వేధించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు స్పెషల్ జడ్జి ఎస్. రోజారమణి తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చింతపల్లి మండలానికి చెందిన గోరటి అనిల్ మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించాడు. విషయం తల్లితండ్రులకు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ఛార్జీ షీటు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన జడ్జి ఎస్. రోజారమణి నిందితుడికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

బాలికను వేధించిన కేసులో మూడున్నరేళ్ల జైలు

చింతపల్లి: ప్రేమ పేరుతో మైనర్ బాలికను వేధింపులకు గురిచేసిన కేసులో నిందితుడికి నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు మూడు సంవత్సరాల ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించినట్లు చింతపల్లి ఎస్ఐ ముత్యాల రాంమూర్తి సోమవారం తెలిపారు. చింతపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2018లో గిరిక అనిల్ అనే ఒక యువకుడు మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి చింతపల్లి ఎస్ఐ నాగభూషణ్‌రావు కేసు నమోదు చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. పీపీ వేముల రంజిత్ కుమార్ వాదనలతో ఏకీభవించిన కోర్టు నిందితుడికి 3సంవత్సరాల 6నెలల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తున్నట్లు తీర్పునిచ్చింది. కేసులో సరైన ఆధారాలు సేకరించిన అప్పటి ఎస్ఐ నాగభూషణ్ రావు, ప్రస్తుత నాంపల్లి సీఐ రాజు, ఎస్ఐ రాంమూర్తి తోపాటు సీడీఓ వెంకట కృష్ణ, భరోసా లీగల్ ఆఫీసర్ కల్పన, లైజన్ అధికారులు, నరేందర్, మల్లికార్జున్‌ను ఎస్పీ అభినందించారు.

భార్యాభర్తల మధ్య మనస్పర్థలు

- మనస్థాపంతో సెల్‌టవర్ ఎక్కిన భర్త

చిట్యాల: భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థలతో మనస్థాపానికి గురైన భర్త సెల్ టవర్ ఎక్కాడు. ఈ సంఘటన చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టంపల్లి గ్రామానికి చెందిన అంతటి ఉపేందర్(40)కు మునుగోడు మండలం క్రిష్టపురం గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉపేందర్ హైదరాబాద్‌లో స్టీల్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావటంతో గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల పిట్టంపల్లి గ్రామానికి వచ్చారు. ఈక్రమంలో ఇద్దరి మధ్య వివాదం రావడంతో మనస్థాపానికి గురైన ఉపేందర్ తన ఇంటి సమీపంలోని సెల్ టవర్ ఎక్కాడు. గ్రామస్తులు సర్దిచెప్పడంతో కిందకు దిగాడు.

పిచ్చికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని వంకమామిడి గ్రామంలో పిచ్చికుక్కలు ముగ్గురు చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దాసరి శైలజ ఆదివారం బోనాల పండుగకు తన తల్లిగారి గ్రామం వంకమామిడికి వచ్చింది. కాగా శైలజ కుమారుడు చింటు సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటుండగా రెండు పిచ్చికుక్కలు అతనిపై దాడి చేసి కణతభాగాన్ని కొరికాయి. కేకలు విని తల్లి పరుగెత్తుకుంటూ రాగా కుక్కలు ఆమెపైనా దాడికి యత్నించాయి. అక్కడే ఉన్న మరికొందరు వాటిని రాళ్లతో తరిమికొట్టారు. తీవ్రంగా గాయపడిన చిన్నారిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు హైదరాబాద్‌లోని నీలోఫర్‌కు తీసుకెళ్లారు. పిచ్చికుక్కలు కొద్దిసేపటికే చికెన్ సెంటర్ నిర్వాహకుడు షానుర్‌బాబా కుమార్తె ఆయేషాతో పాటు నకిరేకంటి నర్సింహ కొడుకును సైతం కరిచి గాయపర్చాయి. అంతటితో ఆగకుండా పలు కుక్కలపై దాడిచేసి గాయపరిచాయని గ్రామస్తులు తెలిపారు.

పన్నెండున్నర గంటల్లో 100కి.మీ పరుగు పందెం పూర్తి


ట్రోఫీ అందుకుంటున్న కిషన్

వలిగొండ : మహారాష్ట్రలోని భారమతి రన్నింగ్ సొసైటీ ఆదివారం పూణే నుంచి భారమతి వరకు నిర్వహించిన 100 కిలోమీటర్ల ఆరోగ్య పరుగు పందెం పోటీల్లో మండలంలోని ప్రొద్దటూరుకు చెందిన దుబ్బ కిషన్ పాల్గొన్నారు. 12:30 గంటల్లో పరుగు పందెం పూర్తి ట్రోఫీ తో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. ప్రస్తుతం కిషన్ ఇంటెలిజెన్స్ విభాగంలో ఇన్‌స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఆదివారం ఉదయం 4 గంటలకు ప్రారంభించిన పరుగు పందెం సాయంత్రం 4:30 గంటలకు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

నల్లగొండ టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం మాని రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై శ్రద్ధ పెట్టాలన్నారు. సాగర్ ఎడమకాల్వ ఆయకట్టుకు సాగునీటి విడుదల చేసేందుకు వెంటనే షెడ్యూల్ ప్రకటించాలన్నారు. నిరంతరం సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు బ్యాంకు రుణాలు, రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేసి పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు.

కొంగలు వాలవు ఇక..

రామన్నపేట: వరి చేలను కొంగలు, పిట్టలు తొక్కి పాడు చేయకుండా రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన యాదయ్య అనే రైతు వినూత్న ప్రయోగం చేశాడు. ఇనుప చువ్వకు బిగించిన సైకిల్‌హబ్‌కు కూలర్ ఫ్యాన్‌ను ఏర్పాటు చేసి గాలికి తిరిగేలా చేశాడు. గాలికి ఫ్యాన్ తిరుగుతూ దానికి అమర్చిన పళ్లెంను తాకుతుండడంతో శబ్దం వస్తుంది. ఆ శబ్దానికి పిట్టలు, కొంగలు వాలకుండా దూరంగా పోతున్నాయి.


వెల్లంకిలో యాదయ్య ఏర్పాటు చేసిన పరికరం